సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం । 28 । జూలై । 2025



రైల్ వన్.. లాభాలెన్నో..
ప్రయాణికుల కోసం రైల్వే శాఖ ఈ నెల 1వ తేదీ నుంచి రైల్ వన్ అనే యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. 8లో



ఆపరేషన్ ముస్కాన్..
బాలకార్మికులను గుర్తించి, సంరక్షించేందుకు ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం చేపడుతున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
32° / 25°

వాతావరణం
జిల్లాలో సోమవారం ఆకాశం మేఘావృతంగా మారుతుంది. పలుచోట్ల ఒకటి, రెండు జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ పుష్పార్చన


స్వామివారికి కల్యాణక్రతువు నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థాన అంతరాలయంలోని మూలమూర్తులకు ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి స్వామివారిని పల్లకీ సేవగా చిత్రకూట మండపానికి తీసుకొచ్చారు. ఆ తర్వాత అర్చకులు స్వామివార్లకు విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. సెలవురోజు కావడంతో పూజాది కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి విశేషపూజలు


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. మండల పరిధిలోని కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువైఉన్న శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయానికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. క్యూలైన్ ద్వారా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అన్నప్రాసనలు, ఒడిబియ్యం, పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించారు. అర్చకులు అమ్మవారికి విశేష పూజలు జరిపారు. పూజాది కార్యక్రమాల్లో ఈఓ ఎన్.రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు, వేదపండితులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్‌శర్మ పాల్గొన్నారు.

నేడు ప్రజావాణి

సూపర్‌బజార్(కొత్తగూడెం): కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలపై ఫిర్యాదులు అందజేయాలని సూచించారు.

గిరిజన దర్బార్..

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న గిరిజన దర్బార్ కార్యక్రమానికి అన్ని శాఖల ఐటీడీఏ యూనిట్ అధికారులు సకాలంలో హాజరు కావాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే దర్బార్‌లో గిరిజనులు తమ సమస్యలపై అర్జీలను అందజేయాలని సూచించారు.

రేపు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి రాక

చుంచుపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు జిల్లాలో పర్యటించనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగూడెంలో నిర్వహించే ర్యాలీ, కార్యకర్తల సమావేశానికి హాజరవుతారని పేర్కొన్నారు.

ఫర్నీచర్ తయారీపై శిక్షణ

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఫర్నీచర్ తయారీలో మూడు నెలల శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన నేషనల్ స్కిల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూషన్(ఎన్ఎస్‌టీఐ) ఆధ్వర్యంలో శిక్షణ ఉంటుందని, 10వ తరగతి ఉత్తీర్ణత సాధించి, 30 సంవత్సరాల లోపు వయసు, కార్పెంటర్ పనిలో కొంత అనుభవం ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి కలిగినవారు ఈ నెల 29న ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లో ఎన్ఎస్‌టీఐ ప్రతినిధి నుంచి వివరాలు తెలుసుకోవచ్చని వివరించారు. జిల్లా నుంచి 10 మంది సభ్యులతో మొదటి బ్యాచ్‌ను ఎంపిక చేస్తామని, సొంత ఖర్చులతో శిక్షణ పూర్తి చేసేందుకు సిద్ధంగా ఉన్న అభ్యర్థులు మాత్రమే ప్రీ స్క్రీనింగ్ టెస్ట్‌కు హాజరు కావాలని సూచించారు. రూ.5 వేల రిజిస్ట్రేషన్ ఫీజు జిల్లా యంత్రాంగం తరఫున చెల్లించనున్నట్లు తెలిపారు.

సంక్షేమమే ధ్యేయం


సమీక్షలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, పక్కన మంత్రులు శ్రీహరి, తుమ్మల, పొంగులేటి, ఎంపీలు రఘురాంరెడ్డి, బలరాంనాయక్, ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి సురేంద్రమోహన్, కలెక్టర్లు అనుదీప్, జితేష్

అధికారులు ఆర్‌ఓఎఫ్‌ఆర్ భూముల జోలికి వెళ్లొద్దు

- ఆగస్టు రెండో వారంలో చేప పిల్లల పంపిణీ
- యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకుంటాం
- శ్రావణమాసంలో ఇందిరమ్మ ఇళ్లలో గృహ ప్రవేశం జరిగేలా చూడాలి
- ఉమ్మడి జిల్లాస్థాయి సమీక్షలో ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రులు శ్రీహరి, తుమ్మల, పొంగులేటి

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, మంత్రులు పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల దరి చేర్చాలని సూచించారు. వరద ముంపు, సహాయక చర్యలు, సంక్షేమ పథకాలు, రేషన్ కార్డుల పంపిణీ తదితర అంశాలపై ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల అధికారులతో ఆదివారం కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి వాకిటి శ్రీహరి, వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. శాఖల వారీగా సమీక్ష జరిపారు.

రూ. 20 వేల కోట్లతో రహదారుల నిర్మాణం

అటవీ, పోలీస్ శాఖ అధికారులు ఆర్‌ఓఎఫ్‌ఆర్ భూముల వద్దకు వెళ్లొద్దని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. ఆ భూములు సాగు చేసుకుంటున్న రైతులకు మూడేళ్లపాటు రూ.12,600 కోట్లతో ఇందిరా గిరి జలవికాసం ద్వారా సోలార్ పంపుసెట్లు, స్ప్రింక్లర్లు, డ్రిప్ పరికరాలు ఉచితంగా అందజేస్తామని తెలిపారు. రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం రూ.20 వేల కోట్లతో ప్రణాళిక సిద్ధం చేయగా, ఎమ్మెల్యేలు ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ రోడ్లకు ప్రతిపాదనలు ఇవ్వడంలో ఆలస్యమవుతోందని అన్నారు. యూరియా కొరత లేకుండా చర్యలు చేపడతామని, రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు. మహిళా సంఘాల ద్వారా చేప పిల్లల పెంపకానికి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. గోదావరి వరదలు ఇప్పటివరకు సాధారణ స్థితిలో ఉన్నాయని అన్నారు. వన మహోత్సవంలో ప్రజలకు ఉపయోగపడే మొక్కలు నాటాలని, గత పదేళ్లగా నాటిన, బతికిన మొక్కల వివరాలు అందించాలని ఆదేశించారు. హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, వర్షాకాలం కావడంతో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు.

సమావేశంలో ఎవరెవరు పాల్గొన్నారంటే...

సమీక్షా సమావేశంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రత్యేక అధికారి సురేంద్రమోహన్, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, కొత్తగూడెం, పినపాక, భద్రాచలం, ఇల్లెందు, అశ్వారావుపేట, వైరా, సత్తుపల్లి ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య, జారే ఆదినారాయణ, మాలోత్ రాందాస్ నాయక్, మట్టా రాగమయి, అటవీశాఖ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య, టీజీ ఐడీసీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, ఖమ్మం కలెక్టర్ అనుదీప్, భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్రీడా పరికరాల పరిశీలన

జిల్లా క్రీడల, యువజన శాఖ ఆధ్వర్యంలో పంపిణీ చేసిన రూ. 50 లక్షల విలువైన క్రీడా పరికరాలను సమావేశం అనంతరం మంత్రులు, ఎమ్మెల్యేలు పరిశీలించారు.

సమన్వయంతో పనిచేయాలి

–ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి వాకిటి శ్రీహరి

ప్రభుత్వ పథకాలు ప్రజల దరి చేరేలా అధికారులు, ప్రజాప్రతిధులు సమన్వయంతో పని చేయాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి వాకిటి శ్రీహరి సూచించారు. రైతాంగ సమస్యలపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని, వర్షాకాలం అప్రమత్తంగా ఉండాలని అన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు విద్యాభివృద్ధికి మలుపు తిప్పే కార్యక్రమమని అన్నారు. ఆగస్టు రెండో వారంలో చేప పిల్లల పంపిణీ కార్యకమాన్ని చేపడతామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా చెరువు గట్లపై చేప పిల్లల పెంపకం, ఖర్చు తదితర వివరాలతో బోర్డులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన ప్రతి ఇంటి ఆవరణలో ఐదు మొక్కలు నాటేలా చూడాలన్నారు.

అభివృద్ధిలో మోడల్‌గా మార్చాలి

– మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

రాష్ట్రంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాను అభివృద్ధిలో మోడల్‌గా తీర్చిదిద్దాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గత ప్రభుత్వ పాలనలో అభివృద్ధి కార్యక్రమాలు లేవని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియా సరఫరాకు కట్టుబడి ఉందన్నారు. వరదలు, వర్షాలకు సంబంధించిన అన్ని ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు.

చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు

– మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

అధికారులు ప్రభుత్వ సంక్షేమ లక్ష్యాన్ని సాధించేలా పని చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. వన మహోత్సవంలో నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలన్నారు. రెవెన్యూ శాఖలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆగస్టు 15 నాటికి డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లను పంపిణీ చేయాలని ఆదేశించారు. ఆగస్టు నెలలో శ్రావణమాసం సందర్భంగా ఇందిరమ్మ ఇళ్లలో గృహ ప్రవేశాలు జరిగేలా చూడాలన్నారు. నిర్మాణానికి అవసరమైన ఇసుక సరఫరా చేయాలని, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ శాఖల పరిధిలో పెండింగ్ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. రహదారుల వెంట ఏర్పడిన గుంతలను పూడ్చాలని చెప్పారు. వర్షాకాలం నీరు కలుషితం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆస్పత్రులు, వసతి గృహాల పర్యవేక్షణ కోసం నియోజకవర్గాలకు ప్రత్యేకాధికారులను నియమించాలని మంత్రి ఆదేశించారు.

పల్లె ముంగిట ‘డిజిటల్’

- ఎస్‌హెచ్‌జీల ద్వారా నగదు రహిత లావాదేవీలు
- దేశవ్యాప్తంగా పది జిల్లాలు.. రాష్ట్రంలో ఖమ్మానికి స్థానం
- ఖమ్మం జిల్లాలో 153 మంది మహిళా సంఘాల సభ్యులకు శిక్షణ
- ఆపై గ్రామాల్లో మోడల్ సీఎస్‌సీల ఏర్పాటుకు ప్రణాళిక



సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఖమ్మం జిల్లాలోని స్వయం సహాయక సంఘాలు(ఎస్‌హెచ్‌జీలు) ఇక నగదు రహిత లావాదేవీలు నిర్వహించనున్నాయి. వీరి ద్వారా ఏర్పాటు చేసే కేంద్రాలతో గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ, బ్యాంకింగ్, ఆధార్, డిజిటల్, బీమా, ఇతర సేవలు దగ్గర కానున్నాయి. డిజిటల్ ఇండియా కార్యక్రమంలో భాగంగా కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా ఈ సేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం డీఐసీఎస్‌సీ(డిజిటల్ ఇండియా కామన్ సర్వీస్ సెంటర్) ప్రాజెక్టు కింద తొలి దఫా దేశంలోని పది జిల్లాలను ఎంపిక చేయగా.. తెలంగాణ నుంచి ఖమ్మానికి స్థానం దక్కింది. సెర్ప్(సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ), సీఎస్‌సీ-ఎస్‌పీవీ(కామన్ సర్వీస్ సెంటర్-స్పెషల్ పర్పస్ వెహికిల్) సంయుక్తంగా నిర్వహించే ఈ ప్రాజెక్టులో జిల్లాలోని 153 మంది స్వయం సహాయక సంఘాల మహిళలను ఎంపిక చేశారు. వీరికి ఇందిరా మహిళాశక్తి పథకం ఆధారంగా శిక్షణ ఇచ్చి మోడల్ సీఎస్‌సీ కేంద్రాలు ఏర్పాటు చేయిస్తారు. తద్వారా సభ్యులకు ఉపాధి లభించడమే కాక గ్రామాల్లో ప్రజలకు ప్రభుత్వ సేవలు చేరువ కానున్నాయి.

దశల వారీగా శిక్షణ

సెర్ప్, సీఎస్‌సీ-ఎస్‌పీవీ సంయుక్తంగా 153 మంది మహిళా సంఘాల సభ్యులకు శిక్షణ ఇవ్వాల్సి ఉండగా, తొలి దశలో 70 మందికి ఆర్ఎస్ఈటీఐ (రూరల్ సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ ట్రెనింగ్ ఇన్‌స్టిట్యూట్) ద్వారా ఏడు రోజుల శిక్షణ పూర్తి చేశారు. ఆపై ప్రోత్సాహకంగా మొదటి ఆరు నెలలు రూ.5వేల చొప్పున గౌరవ వేతనం అందిస్తారు. తద్వారా వారిలో నమ్మకం పెంచడంతో పాటు స్థిరమైన ఉపాధి దిశగా ప్రోత్సహించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇక రెండో దశలో మిగిలిన మహిళలకు టాస్క్(తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్) ఆధ్వర్యాన ఖమ్మంలోని ఐటీ హబ్‌లో ప్రత్యేకంగా ఈడీపీ/డిజిటల్ స్కిల్ శిక్షణ ఇచ్చారు. వీరికి ఉచితంగా బయోమెట్రిక్ పరికరాలు అందించగా, అక్టోబర్ 1 నుంచి ఎంపిక చేసిన గ్రామాల్లో సీఎస్‌సీల ద్వారా డిజిటల్ లావాదేవీలు, ఇతర సేవలు మొదలుకానున్నాయి.

గ్రామాల్లో డిజిటల్ విప్లవం..

గ్రామీణ ప్రాంత ప్రజలు పట్టణాలు, నగరాలకు వెళ్లే అవసరం లేకుండా అన్ని సేవలు అందుబాటులోకి రానున్నాయి. డీఐసీఎస్‌సీ ద్వారా గ్రామాల్లో సీఎస్‌సీ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం రూ.35 వేలు మంజూరు చేస్తుంది. సెర్ప్, సీఎస్‌సీ-ఎస్‌పీవీ సంస్థలు జిల్లాను మండలాల వారీ క్లస్టర్లుగా విభజించి, ప్రతీ గ్రామానికి కనీసం ఒక మోడల్ సీఎస్‌సీ ఉండేలా ప్రణాళిక రూపొందించాయి. ఈ కేంద్రాల ద్వారా ప్రభుత్వ సర్టిఫికెట్లు, బ్యాంకింగ్ సేవలు, ఆధార్ అప్‌డేట్, బిల్లుల చెల్లింపు, మీ సేవ ద్వారా అందే సేవలు, నగదు రహిత లావాదేవీలు చేరువవుతాయి. అయితే, ఈ కేంద్రంలో చెల్లింపులన్నీ నగదు రహితంగా జరిగేలా చూస్తారు.

ఆధార్ సేవలకు అనుమతి వస్తే..

మోడల్ సీఎస్‌సీల ద్వారా గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ సేవలు, బ్యాంకింగ్ లావాదేవీలే కాక ఆధార్ సేవలు కూడా అందించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇందుకోసం కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖతో సమన్వయం చేసి, ఆధార్ అప్‌డేట్ సేవలకు అవసరమైన యూసీఎల్(అప్‌డేట్ క్లైయింట్ లైట్) అనుమతులకు అధికారులు యత్నిస్తున్నారు. ఇవి కూడా మంజూరైతే సీఎస్‌సీ కేంద్రాల ద్వారా ఆధార్ కార్డుల్లో మొబైల్ నంబర్ మార్పు, చిరునామా సవరణ సేవలు అందించగలుగుతారు.

సేవలు చేరువవుతాయి..



బ్యాంకింగ్, బిల్లుల చెల్లింపుల వంటి సేవలు గ్రామీణులకు చేరువవుతాయి. దీంతో పట్టణాలకు వెళ్లే ఇబ్బంది ఉండదు. శిక్షణలో భాగంగా కేంద్రాల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఇది మా జీవితాలను మార్చుకునేలా ఉపయోగపడుతుంది. సెర్ప్ నుంచి రుణం మంజూరు కాగానే సేవలను మరింతగా విస్తరిస్తాం.

– గుగులోతు స్వప్న, ఎస్‌హెచ్‌జీ సభ్యురాలు, చింతగుర్తి, రఘునాథపాలెం మండలం

దేశానికి ఆదర్శంగా నిలిచేలా..



దేశవ్యాప్తంగా డీఐసీఎస్‌సీ ప్రాజెక్టులో పైలట్‌గా ఎంపిక చేసిన జిల్లాల్లో ఖమ్మం ఉంది. ఎస్‌హెచ్‌జీలతో సీఎస్‌సీలు నిర్వహించేలా శిక్షణ అందించాం. ఇందుకు సెర్ప్‌తో ఒప్పందం కుదుర్చుకున్నాం. తద్వారా సభ్యులకు ఉపాధి, గ్రామీణులకు డిజిటల్ సేవలు వేగంగా అందిస్తూ జిల్లాను దేశంలోనే ఆదర్శంగా నిలుపుతాం.

– డాక్టర్ విగ్నేష్ సోర్ణమోహన్, స్టేట్ హెడ్, సీఎస్‌సీ

ప్రతీ ఎకరాకు సీతారామ నీళ్లు ఇవ్వాలి

సీపీఐ జాతీయ సమితి సభ్యుడు హేమంతరావు




మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు బాగం హేమంతరావు (ఇన్‌సెట్) జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన సాబీర్ పాషా

అశ్వారావుపేటరూరల్: జిల్లాలోని ప్రతీ ఎకరాకు సీతారామ ప్రాజెక్ట్ నుంచి సాగునీరు ఇవ్వాలని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు డిమాండ్ చేశారు. ఆదివారం అశ్వారావుపేటలో పార్టీ మూడో జిల్లా మహాసభలో ఆయన మాట్లాడారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సత్తా చాటాలని సూచించారు. ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులు, కమ్యూనిస్టులను లేకుండా చేసేందుకు బీజేపీ కుట్రలు చేస్తోందని ఆరోపించారు. అయితే కార్మిక, కర్షక అభ్యున్నతి కోసం పనిచేసే ఎర్రజెండాలను అంతం చేయడం ఎవరి తరమూ కాదనే విషయాన్ని గ్రహించాలని అన్నారు. అనంతరం మహాసభలో పలు తీర్మానాలను ఆమోదించారు. ఈ మహాసభలో జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా, ఏపీ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎండీ మునీర్, నాయకులు బొల్లోజు అయోధ్య, ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వరరావు, ఎస్‌డీ సలీం, నరాటి ప్రసాద్, గన్నిన రామకృష్ణ, జలాల్, మున్నా, విజయ్‌కాంత్, లక్ష్మీ కుమారి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ జిల్లా కార్యదర్శిగా మూడోసారి సాబీర్ పాషా ఎన్నిక

మహాసభల్లో సీపీఐ జిల్లా కార్యదర్శిగా ఎస్కే సాబీర్ పాషా ఎన్నికయ్యారు. జిల్లా కార్యదర్శిగా ఆయన ఎన్నిక కావడం ఇది మూడోసారి. 79 మంది సభ్యులతో జిల్లా కౌన్సిల్, 27 మందితో జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మరో ముగ్గురిని ఆహ్వానితులుగా నియమించారు.

కిన్నెరసానిలో పర్యాటక సందడి


కిన్నెరసాని ప్రాజెక్ట్‌ను వీక్షిస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్: కిన్నెరసానిలో ఆదివారం పర్యాటక సందడి నెలకొంది. జిల్లాలోని పలు ప్రాంతాలతోపాటు పొరుగు జిల్లాల నుంచి కూడా పర్యాటకులు తరలివచ్చారు. డ్యామ్‌పై నుంచి జలాశయాన్ని, డీర్ పార్కులోని దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. 825 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించగా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.42,860 ఆదాయం లభించింది. 350 మంది బోటు షికారు చేయగా టూరిజం కార్పొరేషన్ సంస్థకు రూ.16,040 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

కిన్నెరసాని నీటి విడుదల

కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎగువ నుంచి వరద నీరు వచ్చి చేరుతుండటంతో కిన్నెరసాని జలాశయ నీటిమట్టం పెరుగుతోంది. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 407 అడుగులు కాగా ఆదివారం 404.30 అడుగులకు చేరింది. ప్రాజెక్ట్‌లోకి 1800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, రెండు గేట్లు ఎత్తి దిగువకు 8 వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు పర్యవేక్షక ఇంజనీర్ ఆదివారం రాత్రి తెలిపారు.

మాస్టర్ ప్లాన్‌లో థీమ్ పార్క్‌కు చోటిస్తారా?

- భద్రగిరిలో కనిపించని రామాయణ ఇతివృత్తాలు
- ప్రణాళికలు రూపొందించినా కార్యరూపం దాల్చనివైనం
- పార్కు ఏర్పాటు చేస్తే భక్తులు, పర్యాటకుల నుంచి విశేష ఆదరణ..




నిర్మాణానికి తీసుకొచ్చిన ఎర్ర ఇసుకరాయి (ఇన్‌సెట్) పురుషోత్తపట్నం వద్ద థీమ్ పార్క్ నిర్మాణానికి ఏర్పాటు చేసిన బోర్డు

భద్రాచలం: శ్రీ సీతాలక్ష్మణ సమేతుడైన రామయ్యకు భద్రగిరిలో భక్తుల రద్దీ పెరుగుతోంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం కూడా రామాలయ అభివృద్ధిపై దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో దేశ నలుమూలల నుంచి వచ్చే భక్తులు, పర్యాటకులకు రామాయణ ఇతివృత్తాలు, ఆధ్యాత్మిక క్షేత్ర ప్రాముఖ్యత, భద్రగిరిపై కొలువైన రాముడి ప్రత్యేకత తదితర అంశాలను తెలిపే మ్యూజియం, థీమ్ పార్క్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. గతంలో థీమ్ పార్క్‌కు స్థలం కేటాయించినా కార్యరూపం దాల్చలేదు. త్వరలో చేపట్టనున్న మాస్టర్ ప్లాన్‌లోనైనా రామాయణ థీమ్ పార్క్‌కు చోటివ్వాలని భక్తులు కోరుతున్నారు.

రెండుసార్లు ప్రణాళికలు..

రామాయణ థీమ్ పార్క్ ఏర్పాటుకు 2003లో సుమారు రూ. 6 కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేశారు. స్థలానికి న్యాయపరమైన అడ్డంకులు రావడంతో ఆ ప్రతిపాదన ఆగిపోయింది. ఆ తర్వాత నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని పురుషోత్తపట్నం దగ్గరలో ఉన్న శ్రీసీతారామ చంద్రస్వామి వారి ఆలయ భూముల్లో 11 ఎకరాలను పార్కుకు కేటాయించారు. అప్పటి పర్యాటకాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి చందనాఖాన్ 2013, ఫిబ్రవరి 27న స్థల పరిశీలన చేసి సుముఖత వ్యక్తం చేశారు. రాముడి వనవాసం సమయంలో గోదావరి పరీవాహక ప్రాంతంలోని గిరిజన ప్రాంతాలతో, గిరిజనులతో ఉన్న అనుబంధానికి గుర్తుగా రామాయణ ఘట్టాలను, గిరిజన సంస్కృతీ సంప్రదాయాలను మేళవిస్తూ రామాయణ థీమ్ పార్క్‌కు అంకురార్పణ చేశారు. ఇందుకు సుమారు రూ. 25 కోట్లతో ప్రణాళిక సిద్ధం చేశారు.

రాష్ట్ర విభజనతో అటకెక్కిన ప్రాజెక్ట్

2014లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల విభజన నేపథ్యంలో థీమ్ పార్క్ ఏర్పాటు ప్రక్రియ అటకెక్కింది. పురుషోత్తపట్నంలో కేటాయించిన 11 ఎకరాల దేవస్థాన భూమి ఆంధ్రప్రదేశ్‌లోకి వెళ్లింది. ప్రాజెక్ట్ రూపకల్పన టీఎస్ టూరిజం ఆధ్వర్యంలో, భూమి ఏపీలో ఉండటంతో పార్కు నిర్మాణం ఆగిపోయింది. ఆ తర్వాత తెలంగాణలోని పర్ణశాలలో నిర్మించాలని భావించినా కార్యరూపం దాల్చలేదు. దుమ్ముగూడెం, అశ్వాపురం మండలాల పరిధిలో సీతమ్మ సాగర్ ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టడంతో ముందస్తుగానే ముంపు పేరుతో ఆ ఆలోచనకు ఫుల్‌స్టాప్ పెట్టారు. అప్పటినుంచి థీమ్ పార్క్ ఏర్పాటును ఎవరూ పట్టించుకోవడంలేదు. కాగా 1,700 ఏళ్ల క్రితం అలంపూర్ దేవాలయాల్లో వాడిన రాయి ఆకారాలు చెక్కుచెదరకుండా ఉందని పరిశీలించాక, ఆ ఎర్ర రాయినే థీమ్ పార్కు కోసం తీసుకొచ్చారు. ప్రణాళికలు కార్యరూపం దాల్చకపోవడంతో ఆ రాయి ముళ్ల పొదలు, చెత్తాచెదారం నడుమ అలాగే ఉండిపోయింది.

ప్రాముఖ్యత తెలిపేలా..

భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ప్రధాన దేవస్థానం, ఆ ప్రాంగణంలోనే ఉండే ఉపాలయాలు, పర్ణశాల తప్ప మరే దర్శనీయ స్థలాలు లేవు. గతంలో చిత్రకూట మండపంలో చిత్రకారులు గీచిన రామాయణ ఇతి వృత్తాలు ఉండేవి. ప్రస్తుతం అందులో సువర్ణపూత వాహనాలను ఉంచటంతో భక్తులకు ప్రవేశాన్ని నిషేధించారు. కల్యాణ మండపం వద్దనున్న బ్లాక్‌లలో బాపు చిత్రాలను ఏర్పరిచారు. అవి సైతం ప్రస్తుతం అందుబాటులో లేదు. ఐటీడీఏ ప్రాంగణంలో గిరిజన మ్యూజియం ఏర్పాటు చేసినా దేవస్థానం సమీపంలో కూడా మ్యూజియం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. రామాయణ థీమ్ పార్క్ నిర్మిస్తే భక్తుల నుంచి విశేష ఆదరణ లభించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వానికి సమర్పించే మాస్టర్‌ప్లాన్‌లో థీమ్ పార్క్‌ను చేర్చాలని దేవస్థాన, జిల్లా ఉన్నతాధికారులను భక్తులు కోరుతున్నారు.

క్లుప్తంగా

రామయ్య సేవలో ప్రముఖులు



పర్ణశాల రామయ్య ఆలయంలో తెలంగాణ రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ తిరుపతి

భద్రాచలంటౌన్/దుమ్ముగూడెం: భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామివారిని ఆదివారం పలువురు ప్రముఖులు సందర్శించారు. తెలంగాణ గిరిజన సహకార సంస్థ చైర్మన్ కొట్నాక తిరుపతి దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దుమ్ముగూడెం మండలంలోని పర్ణశాల రామాలయాన్ని కూడా సందర్శించారు. పంచవటీ కుటీరాన్ని వీక్షించారు. ఏపీలోని అరకు ఎమ్మెల్యే రేగం మచ్చ లింగం కూడా స్వామివారిని దర్శించుకున్నారు. సినీ దర్శకుడు బోయపాటి శ్రీను స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. సరిహద్దు ఏపీలోని మోతుగూడెంలో అఖండ-2 చిత్రీకరణ పూర్తి చేసుకుని వెళ్తున్న క్రమంలో రామాలయాన్ని సందర్శించినట్లు దర్శకుడు తెలిపారు. అనంతరం కమ్మ సేవాసమితి ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఏఈఓ శ్రవణ్‌కుమార్, పీఆర్ఓ సాయిబాబు, పర్ణశాల ఆలయ ఇన్‌చార్జ్ అనిల్ కుమార్, జీసీసీ డీఎం సమ్మయ్య, మేనేజర్ జయరాజు, పూనెం ప్రదీప్ కుమార్, తెల్లం నరేష్, పూనెం కృష్ణ, తెల్లం హరికృష్ణ, పూనెం ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రివాసికి అవార్డు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణానికి చెందిన భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు, ప్రముఖ కవి తోటమళ్ల సురేష్ బాబు బంగారు నంది ఆల్ ఇన్ వన్ అవార్డుకు ఎంపికయ్యారు. హైదరాబాద్‌కు చెందిన రుద్ర బెస్ట్ హెల్పింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యాన అవార్డు ప్రకటించి ఆహ్వానాన్ని పంపినట్లు ఆదివారం ఓ ప్రకటనలో సురేష్‌బాబు తెలిపారు. ఈ అవార్డును ఆగస్టు 10న హైదరాబాద్ శ్రీనగర్ కాలనీలోని శ్రీసత్యసాయి నిగమగమంలో సినీప్రముఖుల చేతుల మీదుగా అందుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణపై శిక్షణ



శిక్షణ పొందిన అధికారులతో వైల్డ్‌లైఫ్ సిబ్బంది

పాల్వంచరూరల్: నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్‌లోని మన్ననూర్‌లో వైల్డ్‌లైఫ్ సిబ్బందికి వన్యప్రాణుల సంరక్షణపై రెండు రోజులపాటు శిక్షణ ఇచ్చారు. ఈనెల 25, 26వ తేదీల్లో అమ్రాబాద్ టైగర్ రిస్క్యూలో శిక్షణ ఇవ్వగా.. వన్యప్రాణి సంరక్షణ విభాగం డివిజన్ పరిధిలోని(వైల్డ్‌లైఫ్) ఎస్ఎఫ్ఓ కిషన్, జింకల పార్కు వాచర్లు, యానిమల్ కీపర్లు ఇబ్రహీం, కల్యాణ్, ఎఫ్‌బీఓ మోహన్‌లు పాల్గొన్నారు. టైగర్ రిస్క్యూ ఎలా నిర్వహించాలి, ఎంత మొత్తంలో మత్తు ఉపయోగించి షూట్ చేయాలి, ఇతర జంతువుల ఆచూకీ తెలిస్తే ఎలా పట్టుకోవాలని వంటి వాటిపై నిపుణులు శిక్షణ ఇచ్చినట్లు ఇన్‌చార్జ్ ఎఫ్‌డీఓ కృష్ణమాచారి తెలిపారు.

పేకాట స్థావరాలపై దాడి

కారేపల్లి: పేకాట స్థావరాలపై కారేపల్లి పోలీసులు దాడి చేసి 12 మందిని అదుపులోకి తీసుకున్న ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఎస్ఐ బి.గోపి ఆధ్వర్యంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఉసిరికాయపల్లి శ్రీకోటమైసమ్మతల్లి ఆలయ సమీపంలోని గుట్టల్లో పేకాట ఆడుతున్నారని సమాచారం అందింది. ఈ క్రమంలో పేకాట స్థావరాలపై దాడి చేసి ఇల్లెందు పట్టణానికి చెందిన 12 మందిని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశారు. వారి వద్ద నుంచి 6 ద్విచక్రవాహనాలు, 9 సెల్‌ఫోన్లు, రూ.25,700 నగదును స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో కానిస్టేబుళ్లు భూక్య శంకర్, హరి, ఓంకార్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.17.463

ఆపరేషన్ ముస్కాన్..

- జిల్లావ్యాప్తంగా 42 మంది బాలకార్మికులకు విముక్తి
- బాలలకు రక్షణగా ప్రత్యేక బృందాలు



చర్లలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

కొత్తగూడెంటౌన్: వెట్టిచాకిరీ చేసే బాలబాలికలను గుర్తించి వారిని సంరక్షించేందుకు ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం జిల్లాలో కొనసాగుతోంది. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా 42మంది బాలకార్మికులకు గుర్తించి విముక్తి కలిగించారు. వారిలో బాలురు – 34, బాలికలు – 8మంది ఉన్నారు. తప్పిపోయిన బాలలు,అనాథలు, బాలకార్మికులుగా పనిచేస్తున్న పిల్లలను గుర్తించి వారికి బంగారు భవిష్యత్ కోసం 'ఆపరేషన్ స్మైల్' అండగా నిలుస్తోంది. బాల కార్మికులను గుర్తించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్ – 11ను జూలై 1వ తేదీ నుంచి 31వరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొనసాగుతోంది. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా 42మంది బాలకార్మికులకు విముక్తి కలిగించారు. బాలకార్మికులను గుర్తించి సీడబ్ల్యూసీ ఆదేశానుసారం విద్య, వైద్యం, వసతి కల్పిస్తున్నారు. చిన్నతనంలోనే అమ్మానాన్నల ఆలనకు దూరమైన పిల్లలు, తప్పిపోయిన పిల్లలు అనాథలుగా, బాలకార్మికులుగా మారి దుర్భర జీవితం సాగిస్తున్నవారికి భరోసాగా నిలుస్తున్నారు. జిల్లా సంక్షేమశాఖ, కార్మిక శాఖ, బాలలసంరక్షణ బృందాలు,పోలీస్, చైల్డ్‌లైన్ (1098) బృందాలు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నాయి.

భవిష్యత్‌కు భరోసా..

18 ఏళ్ల లోపు బాల, బాలికలను గుర్తించి వెట్టిచాకిరీ నుంచి విముక్తి కలిగించి భవిష్యత్‌కు భరోసా కల్పించడమే ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాల ముఖ్య ఉద్దేశం. కాగా, బాల కార్మికులను గుర్తించేందుకు జిల్లా పరిరక్షణ విభాగం (డీసీపీయూ), పోలీసుశాఖ, చైల్డ్‌లైన్ (1098), లేబర్, రెవెన్యూ డిపార్ట్‌మెంట్లు కలిసి బాలల చేత పనులు చేయిస్తున్న యజమానులపై కేసులు నమోదు చేస్తారు. పట్టుబడిన బాలలను ఆరు నెలల వ్యవధిలో సమగ్ర బాలల పరిరక్షణ పథకం కింద బాల సహాయక కిట్లు ఇవ్వడంతో పాటు వారి సంరక్షణ బాధ్యతను ప్రభుత్వమే చూసుకుంటుంది.

42 మంది బాల కార్మికులకు విముక్తి



బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు ప్రభుత్వం చేపట్టి ఆపరేషన్ ముస్కాన్‌తో జిల్లావ్యాప్తంగా 42 మందిని కాపాడాం. బాల కార్మికులుగా మారుతున్నవారికి బంగారు భవిష్యత్ ఇవ్వడం కోసం పటిష్ట చర్యలు తీసుకుంటున్నాం. బాలలతో వెట్టి చాకిరీ చేయిస్తే కఠిన చర్యలు ఉంటాయి. పనులు చేయించుకునే యజమానులపై కేసులు నమోదు చేస్తాం.

–స్వర్ణలతా లెనినా, సంక్షేమ శాఖ అధికారిణి

మెరుగైన సేవలతో బ్యాంకు అభివృద్ధి

భద్రాద్రి బ్యాంక్ 28వ వార్షికోత్సవంలో హైకోర్టు న్యాయమూర్తి రాజేశ్వరరావు



మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాజేశ్వరరావు, పక్కన బ్యాంకు చైర్మన్ కృష్ణమూర్తి

ఖమ్మంగాంధీచౌక్: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించటం ద్వారా బ్యాంకు అభివృద్ధి పథంలో నిలుస్తుందని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు అన్నారు. భద్రాద్రి అర్బన్ కో–ఆపరేటివ్ బ్యాంక్ 28వ వార్షిక సర్వసభ్య సమావేశం ఆదివారం స్థానిక వాసవి కల్యాణ మండపంలో బ్యాంకు చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాజేశ్వరరావు తొలుత వాసవీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. నూతన సాంకేతిక విధానాలను పాటిస్తూ ఖాతాదారులకు ప్రయోజనకరమైన సేవలు అందిస్తే బ్యాంకు మరింతగా విస్తరిస్తుందని తెలిపారు. జిల్లా సహకార అధికారి గంగాధర్ మాట్లాడుతూ.. సమాజాభివృద్ధిలో సహకార వ్యవస్థ కీలకమని, అన్ని వర్గాల ప్రజలకు సహకార రంగాలు అండగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బ్యాంకు చైర్మన్ కృష్ణమూర్తి 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన నివేదికను వినిపించారు. అంతేగాక 2025–26 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను ప్రవేశపెట్టి ఆమోదం పొందారు. గడిచిన ఆర్థిక సంవత్సరం నాటికి బ్యాంకు రూ.598.96 కోట్ల డిపాజిట్లను కలిగి ఉందని, రూ.365.99 కోట్లను పలు రూపాల్లో రుణాలుగా ఇచ్చామని, ఈ ఏడాది నూతనంగా 6 శాఖలను ప్రారంభించి మొత్తం 23 శాఖలతో వినియోగదారులకు సేవలందిస్తున్నామని చెప్పారు. బ్యాంకు మల్టీ స్టేట్ కో–ఆపరేటివ్ బ్యాంకుగా అనుమతులు పొందిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ వైస్ చైర్మన్‌లు సన్నె ఉదయ్‌ప్రతాప్, వేములపల్లి వెంకటేశ్వరరావు, డైరెక్టర్లు దేవత రాజారావు, బలుసు సాంబమూర్తి, మద్ది పిచ్చయ్య, రాజ్ పురోహిత్ చైన్‌సింగ్, వైవీఎస్ రావు, రంగానాగా శ్రీనివాసరావు, దారా జీవన్‌రాం, కర్లపూడి నర్మద, కిలవాయి జయప్రద, బోర్డ్ మేనేజ్‌మెంట్ సభ్యులు సీజీ శాస్త్రి, పైడిమర్రి సత్యనారాయణ, ప్రొఫెసర్ పసుమర్తి మధుసూదన్‌రావు, బ్యాంకు అన్ని శాఖల మేనేజర్లు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

'రైల్ వన్' లాభాలెన్నో..

- ప్రయాణికులకు అందుబాటులో రైల్ వన్ యాప్
- జూలై 1 నుంచి సేవలు అమల్లోకి..



వైరా: రైలు ప్రయాణమంటే ఒక ప్రహసనమే.. ప్రస్తుతం రైల్వే శాఖ ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కసరత్తు చేస్తోంది. ఈ నెల 1వ తేదీ నుంచి రైల్ వన్ అనే యాప్‌ను రైల్వే శాఖ ప్రవేశపెట్టింది. ప్రయాణికులకు కావాల్సిన సమాచారం అంతా ఒకే యాప్‌లో లభిస్తుందని ఇండియన్ రైల్వే శాఖ చెబుతోంది. ఈ యాప్ ద్వారా ప్రయాణికులకు అన్ని సేవలు అందుబాటులోకి రానున్నాయి.

● టికెట్‌కు ఇబ్బంది లేదు..

ఈ యాప్ నుంచి రిజర్వేషన్ చేసుకోవచ్చు. అత్యవసరంగా అన్ రిజర్వు టికెట్ కూడా వెంటనే కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది. ప్లాట్ ఫామ్ టికెట్ సైతం పొందవచ్చు.

● రైళ్ల కోసం..

మనం వెళ్లాల్సిన ప్రాంతానికి ఏ రైళ్లు అందుబాటులో ఉన్నాయని వెతికేందుకు సెర్చ్ ట్రెయిన్స్ బటన్ ఉంటుంది. ఏ ప్లాట్ ఫామ్‌పై రైలు ఆగుతుంది? కోచ్ పొజిషన్ ఎక్కడ ఉందో కూడా తెలుసుకోవచ్చు. రైలు ఎక్కడ ఉంది? ఎప్పుడు వస్తుందని ట్రాక్ యువర్ ట్రెయిన్ ద్వారా తెలుసుకోవచ్చు.

● రిజర్వేషన్ ఇలా..

ఇందులో పీఎన్ఆర్ స్థితిని తెలుసుకోవడానికి కూడా అవకాశం కల్పించారు. ముందస్తు రిజర్వేషన్ టికెట్, సీటు కన్ఫర్మేషన్ స్టేటస్ తెలుసుకోవచ్చు. ట్రెయిన్ క్యాన్సిల్, రిజర్వేషన్ క్యానిల్ వంటి అంశాలను కూడా ఇందులో తెలుసుకోవచ్చు.

● సీటు వద్దకే ఆహారం..


మనకు ఇష్టమైన ఆహారాన్ని ఆర్డర్ చేసుకునేలా అవకాశం ఉంది. ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం ద్వారా వివిధ రైల్వే స్టేషన్లకు చేరుకునే ముందే మనకు నచ్చిన ఆహారాన్ని ఆర్డర్ చేసుకుంటే మీరు ప్రయాణిస్తున్న ట్రెయిన్‌లో మీసీటు వద్దకే తెచ్చి ఇచ్చే సౌకర్యం ఉంది.

సూచనలు, ఫిర్యాదులు..

రైల్వే శాఖకు ఏమైనా సూచనలు ఇవ్వాలి అనుకున్నా.. ట్రెయిన్‌లో ప్రయాణించే సమయంలో సమస్యలు తలెత్తినా ఫిర్యాదు చేయడానికి ఇదే యాప్‌లో రైల్ మదత్ విభాగం అందుబాటులో ఉంది. ఫిర్యాదు చేసిన కొద్ది సమయంలోనే రైల్వేశాఖ సిబ్బంది సమస్యకు పరిష్కారం చూపుతారు.

● డౌన్‌లోడ్ ఇలా..

మొబైల్ ఉపయోగించే వారికి ఎంతో ఉపయోకరంగా ఉండే ఈ యాప్ గూగుల్ ప్లేస్టోర్ నుంచి యాపిల్, ఐఓఎస్, యాపిల్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. తర్వాత సెల్ నంబర్ లేదా మెయిల్ ఐడీ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకొని పాస్‌వర్డ్ పెట్టుకోవడం ద్వారా ఉపయోగంలోకి వస్తుంది.



సీతాఫలం చెట్టుకు కాసినట్లు కన్పిస్తున్న బూడిద గుమ్మడి కాయలు

చెట్టొకటి.. కాయొకటి!

సీతాఫలం చెట్టుకు బూడిద గుమ్మడి కాయలు కాశాయని అనుకుంటే పొరబడినట్లే. అశ్వారావుపేట మండలం కుడుములపాడు–కుక్కునూరు మార్గంలో ప్రధాన రహదారి పక్కనే ఉన్న సీతాఫలం చెట్టుకు గుమ్మడి కాయ తీగ అల్లుకొని కాయలు కాసింది. కాగా, ప్రస్తుతం గుమ్మడి తీగంతా ఎండిపోవడంతో ఆ చెట్టుకు గుమ్మడి కాయలు కాసినట్లు కన్పిస్తున్నాయి. దీంతో ఈమార్గంలో రాకపోకలు సాగించే వారు ఈచెట్టును ఆసక్తిగా తిలకిస్తున్నారు.

– అశ్వారావుపేటరూరల్

బురద నీరు సరఫరా

కొత్తగూడెంఅర్బన్: కిన్నెరసాని తాగునీటిని శుద్ధి చేయకుండా కొత్తగూడెంలో డివిజన్లలో బురద నీటిని సరఫరా చేస్తున్నారు. కొత్తగూడెంలో 80 శాతం మంది ప్రజలు కిన్నెరసాని నీటిని తాగునీరుగా ఉపయోగిస్తారు. ఆదివారం బురద నీటిని విడుదల చేశారు. స్థానికులు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. బురదనీటిని ఎలా తాగాలని, దుస్తులు ఉతికినా బురదమయంగా అవుతున్నాయని వాపోయారు. ప్రజలంతా వాటర్‌ప్లాంట్లకు వెళ్లి తాగునీటిని కొనుగోలు చేసి తెచ్చుకున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



కిన్నెరసాని నుంచి సరఫరా అయిన తాగునీరు

ప్రాణం తీసిన నీటిగుంత



మృతి చెందిన జశ్విత



మృతికి కారణమైన నీటిగుంత

అశ్వారావుపేటరూరల్: నీటిగుంతలో ప్రమాదవశాత్తు పడి ఓ బాలిక మృతి చెందిన ఘటన ఆలస్యంగా ఆదివారం వెలుగులోకి వచ్చింది. స్థానిక ఎస్సై టి.యయాతీ రాజు కథనం ప్రకారం.. మండలంలోని నారంవారిగూడెం కాలనీ గ్రామానికి చెందిన గుల్ల జశ్విత(5) శనివారం అంగన్‌వాడీ కేంద్రం నుంచి ఇంటికి వెళ్లే క్రమంలో మార్గమధ్యలో తోటి పిల్లలతో ఆటలు ఆడుకునేందుకు వెళ్లింది. ఈ క్రమంలో పిల్లలంతా కలిసి సమీపంలో ఓ నర్సరీ వద్ద ఉన్న నీటిగుంట వద్దకు వెళ్లి ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు అందులో పడింది. దీంతో తోటి పిల్లలు గట్టిగా కేకలు పెట్టడంతో కొద్ది దూరంలో మేకలు కాస్తున్న కాపరి నీటిగుంత వద్దకు వెళ్లి బాలికను బయటకు తీయగా అప్పటికే మృతి చెందింది. ఈ ఘటనపై బాలిక తండ్రి పోతురాజు ఆదివారం లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ

కామేపల్లి: బైక్‌ను లారీ ఢీకొట్టిన ఘటనలో ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా మరో వ్యక్తికి గాయాలైన ఘటన ముచ్చర్ల క్రాస్ రోడ్డు సమీ పంలో ఆదివారం చోటుచేసుకుంది. సింగరేణి మండ లం గిద్దవారిగూడెంనకు చెందిన గుగులోత్ రాజశేఖర్, రఘునాథపాలెం మండలం బూడిదంపాడుకు చెందిన కేలోత్ మంగీలాల్ బైక్‌పై ఖమ్మం వైపు వెళ్తుండగా ముచ్చర్ల క్రాస్ రోడ్డు సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఘనంగా సీఆర్‌పీఎఫ్ వ్యవస్థాపక దినోత్సవం



అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న కమాండెంట్ రితేష్‌ఠాకూర్

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం కూనవరం రోడ్డులోని సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్) 141 బెటాలియన్ ప్రధాన కార్యాలయంలో ఆదివారం సీఆర్‌పీఎఫ్ 87వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అమరవీరుల స్తూపం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. గార్డ్ వద్ద గౌరవ వందనంతో పాటు శౌర్య అవార్డు గ్రహీతలను ఘనంగా సత్కరించారు. అనంతరం కమాండెంట్ రితేష్ ఠాకూర్ మాట్లాడుతూ.. క్రౌన్ రిప్రజెంటేటివ్ పోలీస్‌గా 1939 జూలై 27 స్థాపించి 1949లో సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్‌గా పేరు మార్చినట్లు వివరించారు. దేశంలోనే అతి పెద్ద దళంగా ఉన్న సీఆర్‌పీఎఫ్‌లో 3.5 లక్షలకు పైగా సిబ్బంది విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు వామపక్ష తీవ్రవాద ప్రభావిత రెడ్ కరిడార్ ప్రాంతాల్లో దేశ అంతర్గత భద్రతకు వెన్నెముకగా నిలిచిందన్నారు. ఎందరో జవాన్లు తమ ప్రాణాలను త్యాగం చేశారని, వారి బలం, త్యాగాలు స్ఫూర్తినిస్తాయని కొనియాడారు. అనంతరం ధైర్యసాహసాలు ప్రదర్శించిన జవాన్లను పతకాలతో సత్కరించారు.

'యూరియా'పై నిఘా

- సరఫరాను పర్యవేక్షిస్తున్న ప్రభుత్వ శాఖలు
- సహకార అధికారులకు మానిటరింగ్ బాధ్యత
- ఉమ్మడి జిల్లాకు 2,646 మెట్రిక్ టన్నులు



పందిళ్లపల్లి రేక్ పాయింట్‌లో ఎరువుల వ్యాగన్ వద్ద మార్క్‌ఫెడ్ అధికారులు

ఖమ్మంవ్యవసాయం : యూరియా సరఫరాపై ప్రభుత్వం నిఘా పెంచింది. పలు ప్రాంతాల్లో రైతులకు యూరియా లభించక ఇబ్బంది పడుతున్నారు. సహకార సంఘాల్లో నిల్వ లేకపోవడంతో రైతులు పరుగులు తీస్తున్నారు. విస్తారంగా వర్షాలు కురుస్తున్న వేళ.. పంటలకు ఎరువుల వినియోగం పెరిగింది. ప్రధానంగా యూరియా కోసం రైతులు ఆరాట పడుతున్నారు. పలుచోట్ల సరిపడా లభ్యం కాక ఆందోళన కూడా చేస్తున్నారు. ఈ క్రమంలో యూరియా పంపిణీపై ప్రభుత్వం దృష్టి సారించింది. పక్కదారి పట్టకుండా నిఘా పెంచింది. ఇప్పటికే వ్యవసాయ అధికారులు, పోలీసులు ఎరువుల పంపిణీని పర్యవేక్షిస్తుండగా, తాజాగా సహకార శాఖ అధికారులకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు. అంతేకాక మార్క్‌ఫెడ్, వ్యవసాయ, సహకార జిల్లా స్థాయి అధికారుల బృందం కూడా ఎరువుల నిల్వలను, పంపిణీని తనిఖీ చేస్తోంది.

ఉన్నతాధికారులకు నివేదికలు..

యూరియా కొరత, సరఫరాలో చోటు చేసుకుంటున్న ఇబ్బందులను అధిగమించటం, రైతులకు సక్రమంగా ఎరువును అందించటం లక్ష్యంగా సహకార శాఖలో పనిచేస్తున్న జూనియర్ ఇన్స్‌పెక్టర్లు, సీనియర్ ఇన్స్‌పెక్టర్లు, అసిస్టెంట్ రిజిస్ట్రార్లకు సహకార సంఘాల్లో ఎరువుల పంపిణీపై మానిటరింగ్ బాధ్యతలు అప్పగించారు. ఖమ్మం జిల్లాలో 25 మంది సహకార అధికారులు కేటాయించిన సహకార సంఘాల్లో ఎరువుల నిల్వలు, పంపిణీకి తీసుకుంటున్న చర్యలు, అవసరాలు వంటి అంశాలను ఎప్పటికప్పుడు నివేదికలను రూపొందించి ఉన్నతాధికారులకు పంపిస్తున్నారు. అంతేగాక సరఫరా అవుతున్న యూరియా సక్రమంగా రైతులు వినియోగిస్తున్నారా..?, పక్కదారి పడుతుందా..? వంటి అంశాలను కూడా అధికారులు పర్యవేక్షిస్తున్నారు. అంతేగాక జిల్లా సరిహద్దుల్లో ఉన్న చెక్ పోస్టులపై కూడా దృష్టిసారించారు. వీరితో పాటు వ్యవసాయ, పోలీసు యంత్రాంగం యూరియా విక్రయాలను తనిఖీలు చేస్తుంది.

ఉన్నతాధికారుల తనిఖీలు..

యూరియా సరఫరాను ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు తనిఖీ చేస్తున్నారు. మార్క్‌ఫెడ్ గోదాముల్లో ఉన్న నిల్వలు, రేక్ పాయింట్‌కు వచ్చిన యూరియా, అక్కడ నుంచి ఖమ్మం, భద్రాద్రి జిల్లాలకు సరఫరా, సహకార సంఘాల్లో విక్రయాలు, నిల్వలను మార్క్‌ఫెడ్ జీఎం విష్ణువర్ధన్, ఉమ్మడి జిల్లా మేనేజర్ సునీత, జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య, డీసీఓ జి. గంగాధర్ రెండు రోజులుగా తనిఖీ చేస్తున్నారు. ఇప్పటికే కూసుమంచి, తిరుమలాయపాలెం, కొణిజర్ల, ఖమ్మం రూరల్ తదితర మండలాలతో పాటు భద్రాద్రి జిల్లాలోని చంద్రుగొండ, కొత్తగూడెం తదితర మండలాల్లో నిల్వలను పరిశీలించారు.

ప్రాధాన్యతా క్రమంలో సరఫరా..

జలాశయాల్లో నీరు, ప్రధానంగా సాగు చేసే పంటలు, వాటికి ప్రస్తుతం అవసరమైన యూరియా వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రాధాన్యతా క్రమంలో యూరియా సరఫరా చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. జిల్లాలో ఇప్పటికే సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ మండలాల్లో లక్ష్యం మేరకు వరి సాగు చేశారు. మిగితా ప్రాంతాల్లో సాగు పనులు సాగుతున్నాయి. భద్రాద్రి జిల్లాలోని తాలిపేరు, కిన్నెరసాని వంటి ప్రాజెక్టుల కింద వరి, ఇతర పంటలు సాగు చేస్తుండగా ఆయా ప్రాంతాలకు యూరియా సరఫరాపై చర్యలు చేపట్టారు.

రేక్ పాయింట్‌కు చేరిన యూరియా..

చింతకాని: ఉమ్మడి జిల్లాకు ఆదివారం 2,646 మెట్రిక్ టన్నుల యూరియాను ప్రభుత్వం సరఫరా చేసింది. ఎన్ఎఫ్ఎల్(నేషనల్ ఫెర్టిలైజర్స్ కంపెనీ లిమిటెడ్)కు చెందిన యూరియా మండలంలోని పందిళ్లపల్లి రైల్వే రేక్ పాయింట్‌కు చేరింది. దీన్ని పీఏసీఎస్‌లు, ఆగ్రో రైతు సేవా కేంద్రాలకు సరఫరా చేసి, అక్కడ నుంచి రైతులకు పంపిణీ చేస్తారు. ప్రస్తుతం వచ్చిన 2,646 మెట్రిక్ టన్నుల్లో ఖమ్మం జిల్లాకు 1,446, భద్రాద్రి జిల్లాకు 1,200 మెట్రిక్ టన్నులు కేటాయించారు. జిల్లాకు కేటాయించిన 1,446 టన్నుల్లో మార్క్‌ఫెడ్‌కు 867.6 టన్నులు, ప్రైవేటు డీలర్లకు 578.4 టన్నులు సరఫరా చేశారు.

చికిత్స పొందుతున్న వివాహిత మృతి

రఘునాథపాలెం: గడ్డిమందు సేవించి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వివాహిత మృతి చెందిన ఘటన రఘునాథపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రఘునాథపాలెం సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. డోర్నకల్ మండలం తోడేళ్లగూడెం గ్రామానికి చెందిన అల్లి ఉమ కుమార్తె స్వాతికి మూడేళ్ల కిందట రామకృష్ణతో వివాహం జరిగింది. వీరికి రెండేళ్ల పాప ఉంది. వివాహానికి ముందే స్వాతి కడుపునొప్పితో బాధపడుతోంది.ఈక్రమంలో పెళ్లి అయిన తరువాత తలనొప్పి కూడా ప్రారంభమై ఇబ్బంది పడుతోంది. ఎన్ని ఆస్పత్రులకు తిరిగినా నయం కాకపోవడంతో మనస్తాపానికి గురైన ఆమె గత నెల 30న ఇంట్లో గడ్డిమందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. మృతురాలి తల్లి ఉమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.